వేరుశనగ రైతులకు ఊరట

- తాజాగా కురిసిన వర్షాలతో పంటలకు జీవం
- మడకశిర నియోజకవర్గంలో 16,110 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మడకశిరలో వర్షానికి తేరుకున్న వేరుశనగ పంట

మడకశిర: పంట పెట్టుబడి కూడా తిరిగి రాదని భావించిన వేరుశనగ సాగు చేసిన రైతులకు కాస్త ఊరట లభించింది. నియోజకవర్గంలో తాజాగా కురుస్తున్న వర్షాలు పంటకు బలాన్నిచ్చాయి. ఎండిపోతున్న పంట తాజాగా కురిసిన వర్షాలతో పచ్చగా మారాయి.

పెట్టిన పెట్టుబడి తిరిగొచ్చే అవకాశం

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో శుక్రవారం రాత్రి వాన దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మంగళవారం కూడా అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలతో వేరుశనగ పంటకు జీవం వచ్చినట్లైంది. నియోజకవర్గంలోని రైతులకు ప్రధాన వాణిజ్య పంట వేరుశనగ. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు ఆశాజనకంగా వచ్చాయి. దీంతో రైతులు ముందుగానే వేరుశనగ పంటను సాగు చేశారు. వేరుశనగ పంట సాగు చేసిన తర్వాత అదునుకు సరిపడే వర్షాలు కురవలేదు. గత నెల రోజుల నుంచి వర్షాలు రాకపోవడంతో వేరుశనగ పంట ఎండుముఖం పట్టింది. ప్రధానంగా పూత కాసే సమయంలో వేరుశనగ పంటకు వర్షాలు చాలా అవసరం. అయితే సరైన సమయంలోనే వర్షాలు పడలేదు. ఈ నేపథ్యంలో రైతులు ఈఏడాది కూడా వేరుశనగ పంటపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే ఎట్టకేలకు వర్షాలు మొదలుకావడంతో వేరుశనగ పంటపై రైతులకు ఆశలు చిగురించాయి. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే కొంత వరకూ దిగుబడి లభిస్తుందని రైతులు చెబుతున్నారు. కనీసం రైతులు పెట్టిన పెట్టుబడి తిరిగొచ్చే అవకాశం ఉంటుందంటున్నారు.

16,110 హెక్టార్లలో వేరుశనగ

నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 16,110 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు. సాధారణ సాగు విస్తీర్ణం 26,472 హెక్టార్లు కాగా వర్షాలు సమయానికి పడక పోవడంతో 16,110 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటను సాగు చేశారు. మడకశిర మండలంలో 4,142, అగళిలో 1,850, అమరాపురంలో 3,884, గుడిబండలో 4.200, రొళ్ల మండలంలో 2,034 హెక్టార్లలో చొప్పున వేరుశనగ పంట సాగైంది.

వేరుశనగకు కొంత ఊరట



వర్షంతో కొంత వరకు వేరుశనగ పంటకు ఊరట లభించింది. ఎండిపోతున్న పంటకు జీవం వచ్చింది. 15 రోజుల క్రితమే వర్షాలు పడి ఉంటే వేరుశనగ పంట దిగుబడి బాగా ఉండేది. చాలా ఆలస్యంగా వర్షం రావడంతో దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. పెట్టిన పెట్టుబడి తిరిగొస్తే చాలు.

– కదురప్ప, ఫళారం, గుడిబండ మండలం

పంటకు చాలా మేలు



వర్షంతో వేరుశనగ రైతులకు చాలా మేలు జరిగింది. పంట ఎండిపోతున్న సమయంలో వర్షం రావడంతో పంటకు జీవం వచ్చింది. వేరుశనగ చెట్లలో ఊడలు దిగడానికి ఈ వర్షం ఎంతగానో దోహదం చేస్తుంది. పంట దిగుబడి పెరగడానికి అవకాశం ఏర్పడింది. వేరుశనగ పంటకు ఇంకా వర్షాలు చాలా అవసరం. అదును ప్రకారం వర్షం వస్తే ఆశించినస్థాయిలో పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– కృష్ణమీనస్, ఏడీఏ, మడకశిర

కంది రైతుల్లో ఆనందం

రొద్దం: మండల వ్యాప్తంగా ఇటీవల వర్షం పడడంతో కంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు మంచి పదును అయిందని రైతులు చెబుతున్నారు. మండలంలో ఈ ఏడాది 4,800 వేల హెక్టార్లలో కంది పంట సాగు చేసినట్లు వ్యవసాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈనెలలో వర్షం పడకపోతే కంది పంట పూర్తిగా దెబ్బతినేదని, తాజాగా కురిసిన వర్షానికి కంది పంటకు ఎంతో మేలు జరిగిందంటున్నారు.



పెద్దగువ్వలపల్లి వద్ద సాగైన కంది పంట

పంటకు ప్రాణం వచ్చింది



వర్షం రావడంతో కంది పంటకు ప్రాణం పోసినట్టైంది. జూన్ 15న 8 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. అయితే వర్షం ఆలస్యం కావడంతో పంట దెబ్బతింటుందని భావించాను. తాజాగా వర్షం రావడంతో చాలా ఆనందంగా ఉంది.

– అంజినరెడ్డి, రైతు,పెద్దగువ్వలపల్లి

పీహెచ్‌సీలో అరుదైన శస్త్ర చికిత్స



రాఘవ చేతి వేళ్లలో ఇరుక్కుపోయిన గాజు ముక్క తొలగిస్తున్న వైద్యుడు రామకృష్ణ



తొలగించిన గాజు ముక్క

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యుడు రామకృష్ణ అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. చిలమత్తూరుకు చెందిన రాఘవ అనే యువకుడి కుడిచేయి నెలరోజులుగా నొప్పి ఉండటంతో శుక్రవారం పీహెచ్‌సీకి వచ్చారు. డ్యూటీలో ఉన్న డా.రామకృష్ణ గాయం కూడా లేకపోవడాన్ని గుర్తించి చేతి వేళ్ల మధ్య గాజు ముక్క ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటి కేసులను సాధారణంగా పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తారు. అయితే తనకున్న అనుభవంతో రాఘవకు అనస్తీషియా ఇచ్చి చేతిలోపల ఇరుక్కుపోయిన గాజు ముక్కను సుమారు 45 నిమిషాలు కష్టపడి తొలగించారు. చాలా సున్నితమైన నరాల మధ్యన గాజుముక్కను ఆయన చిన్నపాటి శస్త్ర చికిత్స ద్వారా తొలగించి సదరు యువకుడికి నొప్పి నుండి విముక్తి కలిగించారు. ఆస్పత్రిలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ పుష్ప సహాయంతో ఆయన శస్త్ర చికిత్స చేశారు.

ఆగిపోయిన ధ్రువపత్రాల జారీ

- తహసీల్దార్ లేక ప్రజల అవస్థ



అగళి తహసీల్దార్ కార్యాలయం

అగళి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడంతో వివిధ ధ్రువపత్రాల జారీ నిలిచిపోయింది. మండల పరిధిలోని దాదాపు 50 గ్రామాల ప్రజలు వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. అయితే తహసీల్దార్ లేకపోవడంతో ఏ పనులు జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు గత నెల 27న బదిలీపై వెళ్లారు. శ్రీనివాసులును ఇక్కడికి బదిలీ చేసినా ఆయన మాత్రం నేటికీ బాధ్యతలు చేపట్టలేదు. మరొకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా అప్పజెప్పకపోవడంతో వివిధ ధ్రువపత్రాల కోసం విద్యార్థులు, పలు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నూతన తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు సన్మానం



లేపాక్షి: అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

లేపాక్షి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన మండల విద్యుత్‌శాఖ సహాయ ఇంజనీర్ వెంకటేశులు, లైన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌ను విద్యుత్‌శాఖ సిబ్బంది శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ కమిషనర్‌గా వంశీకృష్ణ భార్గవ్ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పట్టణానికి చెందిన పలువురు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ మూర్తి, కన్నా, నంజుండ, బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భద్రత కల్పించాలి

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న కేజీబీవీలో కోతులు దాడి చేయకుండా విద్యార్థినులకు భద్రత కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై కోతులు దాడి చేసి గాయపరిచిన ఘటనకు సంబంధించి ఇన్‌చార్జ్ ఎస్‌ఓ సుబ్బలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. తరచూ కోతులు తరగతి గదుల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని, అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

హౌసింగ్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. శుక్రవారం రాత్రి కాలనీకి ఏర్పాటు చేసిన ఎల్టీ విద్యుత్ వైర్లపై 11 కేవీ విద్యుత్ తీగలు తెగి పడటంతో ఇళ్లలో మంటలు చెలరేగాయి. ఇళ్లలో ఉన్న వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగుతీశారు. ఓ సెల్ టవర్‌కు ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ లైన్, కాలనీకి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తగిలే విధంగా అధికారులు ఏర్పాటు చేయడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోయారు. అధిక విద్యుత్ సరఫరా కావడంతో ఇళ్లలోని బల్బులు, స్ట్రీట్ లైట్లు కాలిపోయాయి.

యథేచ్ఛగా ఇసుక తరలింపు



ట్రాక్టరుకు ఇసుక వేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలో ఇసుక, మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పరిగి చెరువులో నిత్యం మట్టిని జేసీబీ యంత్రాలతో తోడి ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మామూళ్ల మత్తు, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పని చేయడం మానీ ఇసుక, మట్టి దందాకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని సిద్దగిరి గ్రామంలో మరమ్మతుల తర్వాత ఆలయంలో శనివారం నుంచి సోమవారం వరకూ మహాగణపతి, శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి నూతన శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం మహాగణపతిపూజ, పుణ్యాహం, దేవనాంది, మాతృకాపూజ, పంచగవ్యమేళన, నవగ్రహ, హోమాలు జరుగుతాయన్నారు. అలాగే ఆదివారం యాగేశ్వరాధన, లక్ష్మీ వేంకటేశ్వర శిలా విగ్రహాలకు జల, క్షీర, పుష్పి, శయ్యాధివాసములు, సాయందీక్షా హోమం, ధ్వజప్రతిష్ఠ ఉంటాయన్నారు. సోమవారం మహాగణపతి, లక్ష్మీ వేంకటేశ్వర, గోపురకలశ ,ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సమయానికి బస్సులు నడపాలి

మడకశిర: నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లడానికి వీలుగా సమయానికి ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని మడకశిర తాలూకా సీపీఐ కార్యదర్శి పవిత్ర డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ సరైన సమయానికి ఆర్టీసీ అధికారులు బస్సులను నడపక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయం కళాశాలలు, పాఠశాలలకు రావడానికి, సాయంత్రం ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని బస్సులు నడపాలని, లేకపోతే డిపో ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తాగునీటి పథకాన్ని పూర్తి చేయండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయిలో దాహార్తిని తీర్చడానికి దాదాపు రూ. 68 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకాన్ని పూర్తి చేయడానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చొరవ తీసుకోవాలని 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర ఒక ప్రకటనలో కోరారు. తాగునీటి పథకానికి ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) నిధులను అందించిందన్నారు. ఇప్పటికే ఈపథకం కింద మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 7 తాగునీటి ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త ఎస్సీ కాలనీలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం ఈ పథకం పనులు ఆగిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని తాగునీటి పథకం పనులు పూర్తి చేస్తే మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి సమస్య ఉండదన్నారు.

మడకశిరలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: కోల్‌కతాలో జరిగిన ట్రైనీ మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర మాట్లాడుతూ మహిళా డాక్టర్లకు ఆస్పత్రుల్లో రక్షణ కరువైందన్నారు. ట్రైనీ మహిళా డాక్టర్‌ను కడతేర్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

కేసులపై న్యాయమూర్తుల సమీక్ష



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

పెనుకొండ: పట్టణంలోని కోర్టులో న్యాయమూర్తులు వాసుదేవన్, బొజ్జప్ప, ముజీబ్ సయ్యద్ పసలల్ల పలు కేసులపై శుక్రవారం పోలీస్ అధికారులతో సమీక్షించారు. సెప్టెంబర్ 14న కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులతో సమావేశమైన న్యాయమూర్తులు రాజీకి సాధ్యమైన అన్ని కేసులను లోక్‌అదాలత్‌లో ప్రవేశపెట్టి కేసుల రాజీకి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో కేసుల రాజీకి తీసుకోవాల్సిన విషయాలను న్యాయమూర్తులు వివరించారు.

టూటౌన్ సీఐగా అబ్దుల్ కరీం



హిందూపురం టౌన్: హిందూపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా అబ్దుల్ కరీం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఆయన హిందూపురం టూటౌన్ సీఐగా నియమితులయ్యారు. గతంలో ఆయన హిందూపురం వన్ టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలందరూ పోలీసుశాఖకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

గుడిబండ తహసీల్దార్‌గా కరుణాకర్



గుడిబండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా కరుణాకర్ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా పని చేస్తామన్నారు. ప్రజలు నేరుగా తనను కలిసి సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. అంతకు ముందు డిప్యూటీ తహసీల్దార్ రామ్‌భూపాల్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దారుకు స్వాగతం పలికారు.


ఫైనల్ మ్యాచ్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 18న జరిగే యూటీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు శెట్టిపి జయచంద్ర, సుధాకర్, నరేష్, నారాయణస్వామి కోరారు. ఫైనల్ మ్యాచ్ ధర్మవరం, రొళ్ల జట్ల మధ్య జరగనుందన్నారు. ఉదయం 9 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ

లేపాక్షి: మండలంలోని మానేపల్లి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక పూజలు చేశారు.

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లారీ

పెనుకొండ: పట్టణంలోని కృష్ణదేవరాయ జంక్షన్‌లో 44వ జాతీయ రహదారిపై ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళితే.. శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరు వైపు నుంచి పెనుకొండ మీదుగా 44వ జాతీయ రహదారిపై అనంతపురం వైపునకు టెంకాయల లోడ్‌తో లారీ వెళ్తోంది. అయితే కృష్ణదేవరాయ జంక్షన్ వద్ద లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొంటూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులు, ఇతర వాహనాలు వచ్చి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.



గుడిబండ: ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి



హిందూపురం: లక్ష్మీదేవి అలంకరణలో వాసవీమాత



హిందూపురం: అలంకరణలో లక్ష్మీదేవి



హిందూపురం: అష్టలక్ష్మి ఆలయంలో..



హిందూపురం: లక్ష్మీదేవిగా బోయకొండదేవి



రొళ్ల: నగదు అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



మడకశిర: అరటి పండ్ల అలంకరణలో ఒడిసలమ్మ

వరలక్ష్మీ నమోస్తుతే !

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని అమ్మవార్ల ఆలయాలతో పాటు మహిళలు పెద్ద ఎత్తున ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి వరలక్ష్మిని పూజించారు. వరలక్ష్మిని ఉంచిన మండపాల వద్ద బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంచి పూజలు చేశారు. ప్రత్యేకంగా ముత్తైదువులకు పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, గాజులు అందించి వ్రతాన్ని ఆచరించారు.



గుడిబండ మండలం లక్కమ్మదేవికి జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు



పావగడ: ప్రత్యేక అలంకరణలో శీతలాంబాదేవి



మడకశిర: అలంకరణలో వరమహాలక్ష్మీ



మడకశిర: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనిడిమామిడమ్మ



రొద్దం: ఓ ఇంటిలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన దృశ్యం



లేపాక్షి: ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



అగళి: వరలక్ష్మీకి పూజలు చేసిన దృశ్యం



అమరాపురం: ప్రత్యేక అలంకరణలో వరమహాలక్ష్మి

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు



తమ్మడేపల్లిలో నేల కొరిగిన చింత చెట్టు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి, నగోనపల్లి, విరుపసముద్రం గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి చింత, వక్క చెట్లు నేలకొరిగాయి. తమ్మడేపల్లి రైతు సిద్దేశ్వరప్ప తోటలో 10 వక్క చెట్లు, భారీ చింత చెట్టు నేల కొరిగాయి. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన చిత్తప్ప తోటలో 25 వక్క చెట్లు, ఈరలింగప్పకు చెందిన 5 వక్క చెట్లు, తిప్పేస్వామి 5 వక్క చెట్లు నేలకొరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా నష్టం జరిగిందని సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.